క్లుప్తంగా

జక్లేర్‌ను మండలం చేయాలని వినతి



మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ.. మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గురువారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అన్ని వనరులు కలిగిన సౌకర్యాలు ఉన్నాయని, రైల్వే జంక్షన్, అంతర్‌రాష్ట్ర రహదారి, హైస్కూల్, బ్యాంకులు కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామ పెద్దవాగు నుంచి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాటిని గుర్తించి పోలీ స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్‌ఐ మన్నన్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వర్కూర్ శివారులో ఆన్‌లైన్ ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో అదే అదనుగా చేసుకుని అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అయోడిన్ లోపంపై కళాజాత ప్రదర్శన

మద్దూరు: అయోడిన్ లోపంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో మండలంలోని మద్దూరు, దోరేపల్లి, భీంపూర్, నాగిరెడ్డిపల్లి, దమ్‌గాన్‌పూర్ తదితర గ్రామాల్లో కళజాత ప్రదర్శన నిర్వహించారు. అయోడిన్ లోపం వల్ల జరిగే అనర్థాలు ప్రదర్శన ద్వారా వివరించారు. దీని నివారణ కోసం అంగన్‌వాడీలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డీసీఓ ప్రసాద్, శ్రీకాంత్, కళాకారులు కృష్ణ, నర్సింహ, కిరణ్, ఆనందమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ యాక్షన్‌ప్లాన్ రివ్యూ చేయండి



నర్వ: ఎస్సెస్సీ యాక్షన్‌ప్లాన్‌ను బయోసైన్స్ ఉపాధ్యాయులు తయారు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. గురువారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బయోసైన్స్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మరికల్, ధన్వాడ మండలాల బయోసైన్స్ ఉపాధ్యాయులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎల్ఐపీ, ఉన్నతి కార్యక్రమాలపై ఆయన రివ్యూ చేసి సూచనలు అందించారు. కాంప్లెక్స్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మి, ఆయా మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణపేట: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై టీడబ్ల్యూజేఎఫ్ ఫెడరేషన్ నిరంతరంగా రాజీలేని పోరాటం చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బండి విజయకుమార్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో జిల్లా తొలి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై కార్యాచరణ రూపొందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్, కోశాధికారి లింగం, నర్సింహులు, ఎజాజ్ సోఫీ, మద్దిలేటి ముజ్జమిన్, అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. మహిళలు ప్రతి రంగంలో రాణించాలని సూచించారు. నెలరోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్ రాములు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ వంశీకృష్ణ, డీఎల్పీఓ సుధాకర్ రెడ్డి, రాములు, కెంచె శ్రీనివాస్, యాదగిరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం

మక్తల్: మార్కెట్ యార్డులో అన్నిరకాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు.. రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కల్పించి వ్యాపారస్తులు ఇచ్చేవిధంగా అన్ని విధాలుగా న్యాయం చేస్తామన్నారు. కర్ణాటక కంటె అధికంగా ధర మన దగ్గరే ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా మైదానాలేవి..?



మరికల్‌లో పాఠశాల ఆవరణలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

- గ్రామీణ క్రీడలకు అందని ప్రోత్సాహం
- పాఠశాల ఆటలకు దాతలే దిక్కు
- ప్రభుత్వం నుంచి అందని క్రీడా సామగ్రి

మరికల్: గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాణిస్తేనే దేశ ప్రతిష్ట పెరుగుతుందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడా టోర్నమెంట్లకు స్థలాలు లేక విద్యార్థులు, యువకులు ఇబ్బందులు పడుతున్నారు.
మండలంలో ఐదు ఉన్నత పాఠశాలలు, 23 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కడ కూడా క్రీడా మైదానం లేదు. నిబంధనల ప్రకారం పాఠశాల విద్యార్థులకు క్రీడా టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు ఐదు ఎకరాల స్థలం ఉండాలి. స్థలం లేకపోవడం వల్ల ఇరుకైనా స్థలంలోనే విద్యార్థులకు ఆటలు ఆడించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికల్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో వెయ్యిమందికి పైగా విద్యార్థులు ఉన్నారు, కాని ఇక్కడ అరా ఎకరా స్థలం కూడా లేకపోవడంతో ఆగస్టు-15, జనవరి 26న నిర్వహించే క్రీడా పోటీలను దాతల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నారు.

పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడలు..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, సాఫ్ట్‌బాల్, టెన్నికాయిట్, ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ తదితర ఆటలను ఆడించాలి. ఒక పక్క పాఠశాల ఆవరణలో క్రీడా మైదానాలు లేక, మరోపక్క ప్రభుత్వం నుంచి నిధులు రాక పెద్ద టోర్నమెంట్లను నిర్వహించలేకపోవడంతో విద్యార్థులు క్రీడలో రాణించలేకపోతున్నారు. దీంతో గ్రామీణస్థాయి నుంచి మండల, డివిజన్, జిల్లా టోర్నమెంట్లకు విద్యార్థులు ఎంపిక కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దాతల సహకారంతోనే క్రీడలు



ప్రతిసారి దాతల సహకారంతోనే పాఠశాల ఆవరణలో విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి క్రీడల అభివృద్ధికి నిధులు మంజూరు కాక దాతల సహకారంతో క్రీడా వస్తువులను కొనుగోలు చేసి అందజేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి క్రీడా మైదానం కోసం స్థలం కేటాయిస్తే బాగుంటుంది.

– శ్రీకాంత్‌రెడ్డి, యువక మండలి అధ్యక్షుడు, మరికల్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

క్రీడా మైదానం విషయం తమ పరిధిలో లేదు. విద్యార్థులు గ్రామీణ, పాఠశాలస్థాయి క్రీడల్లో రాణించాలంటే క్రీడా మైదానం ఎంతో అవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అలాగే క్రీడా సామగ్రి విషయాన్ని వారితో చర్చిస్తాం.

– మనోరంజని, ఎంఈఓ, మరికల్

మరోపక్క పాఠశాల స్థాయి క్రీడలకు ప్రభుత్వం నుంచి క్రీడా కిట్స్‌లు కూడా రావడం లేదు. దీంతో వారు గ్రామీణ క్రీడలకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా మైదనాలు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధలింగేశ్వరస్వామి

ఊట్కూరు: భగవంతుడిని ధ్యానించడంతో ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ సిద్ధి లింగేశ్వరస్వామి అన్నారు. గురువారం మండలంలోని ఉదయం నగరసంకీర్తన కార్యక్రమం చేపట్టారు. అనంతరం శివాజీనగర్, సర్దార్‌నగర్, మేన్‌బజార్, గాంధీనగర్ వీధుల్లో పంచాక్షరి నామం జపిస్తూ నగర సంకీర్తన గోశాల ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలుచేసి హోమం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందించాల్సి ఉందని అన్నారు. వారంలో ఒకరోజు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు వెళ్లి పూజా కార్యక్రమాలు చేయాలని అన్నారు. ధర్మజాగృతి ప్రవచనం కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్రామంలో నగర సంకీర్తన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో విరుపాక్షిస్వామి, శ్రీ గౌరయ్యస్వామి, సూర్యప్రకాష్‌రెడ్డి, భాస్కర్, ఎల్కోటి నారాయణరెడ్డి, అరవింద్‌కుమార్, కృష్ణయ్యగౌడ్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

మరికల్: పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి, కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అంజమ్మ, శ్రీనివాసులు దంపతులు సొంత ఖర్చులతో తెచ్చిన నోట్‌పుస్తకాలు, పలకలను ఎమ్మెల్యే పాఠశాల విద్యార్థులకు అందజేశారు. సూర్యమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, జనార్థన్, సత్యనారాయణ, రఘు, హరీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు వినతి

మక్తల్: సంగంబండ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ.. ఎంపీ డీకే అరుణకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. 174 సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 320 ఎకరాల వ్యవసాయ పొలాలకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎంపీకి శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో జుట్ల శంకర్, చిన్నహన్మంతు, నర్సింహులు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

మద్దూరులో ప్రారంభమైన ఆధార్ సేవలు

మద్దూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రంలో గురువారం ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, నూతన ఆధార్ కార్డులను దింపడం జరుగుతుందని నిర్వాహకుడు కృష్ణ తెలిపారు. ఈ నెల 22న 'సాక్షి దినపత్రికలో 'ఆధార్ కేంద్రాలు లేక పరేషాన్' అనే కథనానికి అధికారులు స్పందించారు. గత కొన్నిరోజులుగా మండలంలోని ఉన్న రెండు ఆధార్ కేంద్రాలు మూతపడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో జిల్లా ఈడీఎం విజయ్‌కుమార్ స్పందించి జిల్లాలో ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో పాత ఆధార్ కేంద్రంలోనే పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఎస్ఎస్ఏ జిల్లా సూపర్‌వైజర్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకృష్ణను నియమించారు. ఆయన ఐడీ ద్వారా ఆధార్ సేవలు కొనసాగనున్నాయి.

పొలం బాటకు భూమిపూజ



మరికల్: మండలంలోని రాకొండ శివారులో వ్యవసాయ పొలాలకు వెళ్లేబాటలకు గురువారం కాంగ్రెస్ నాయకులు, రైతులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నరహరి, జయసింహారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంతనిధుల కింద పొలంబాట పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పొలాలకు వెళ్లేరోడ్డును మట్టివేసి మరమ్మతు చేస్తామన్నారు. రాజు, రాములు, ప్రతాప్‌రెడ్డి, రామిరెడ్డి, అంజియాదయ్ పాల్గొన్నారు.

నేతాజీ జీవితం ఆదర్శం కావాలి



మక్తల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్/ ఎడ్యుకేషన్: నేతాజీ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలనీ బీజేపీ నాయకులు కే. రతంగ్ పాండు రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. సత్య యాదవ్, రఘురామయ్య గౌడ్, రఘువీర్, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలి

ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్, కళాశాలల విద్యార్థులకు క్రీడా పోటీలను మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ రాజేష్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడారు.. శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడాలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సతీష్, వెంకటేష్, ఇంతియాజ్, చరణ్ రెడ్డి, వివేకానంద, వెంకటరమణ, గంగాధర్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

మక్తల్: నేతాజీ జయంతి సందర్భంగా పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో రక్తదాన శిబిరాన్ని బీజేపీ నాయకులు కొండయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, వంశీ, ప్రతాప్‌రెడ్డి, సుకన్యశేఖర్, రాజుగౌడ్, మహే ష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



పేటలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వాల్‌లో..

నర్వ: మండలంలోని కల్వాల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు.. కార్యక్రమంలో గ్రామస్తులు బండి నారాయణరెడ్డి, రవివర్మ, అంపయ్య పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్ను చెల్లించేలా చూడాలి



జీపీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీఓ సుధాకర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం డీఎల్పీఓ సుధాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీపీ భవనంలో పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించే విధంగా చూడాలని, గ్రామంలో రోడ్లను గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వందశాతం ఇంటి పన్ను అయ్యేటట్టు చూడాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాణిక్యరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధన్వాద: మండలంలోని కొండాపూర్‌లో ఆపరేషన్ మెరిసి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇరువురు వ్యక్తులకు బోధకాలు వ్యాధి ఉన్నట్లు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ కో-ఆర్డినేటర్ నర్సింహ, హజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- కలెక్టర్ సిక్తాపట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మక్తల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సిక్తాపటా న్నయక్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులలో కొనసాగుతున్న గ్రామ సభలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎన్నిక చేస్తున్నామని సూచించారు. నిజమైన లబ్ధిదారుల పేర్లు రానివారు గ్రామసభలో కాని, మండలంలోని ప్రజాపాలన సేవాకేంద్రల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కమిషనర్ బోగేశ్వర్, కౌన్సిలర్లు రాములు పాల్గొన్నారు.

గొర్లోనిబాయిలో ..

కొత్తపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ జయరాములు అన్నారు. మండలంలోని గొర్లోనిబాయిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.. ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలియజేశారు. అధికారి రమేష్, ఎంఆర్ఐ శ్రావణ్, ఏఈఓలు మోహన్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందుతాయి..

మద్దూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తహసీల్దార్ మహేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని 12 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. చాలా గ్రామాల్లో అధికారులు శాఖల వారిగా చదివే లిస్టులో తమ పేర్లు లేవంటూ అధికారులు దృష్టికి తీసుకురాగా మళ్లీ ఇప్పుడు ఇవ్వా ల్సిందిగా సూచించారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహారెడ్డి, తహీసల్దార్లు మహేష్‌గౌడ్, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

ఊట్కూరు: మండలంలోని వివేకానంద చౌరస్తాలో అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గ్రామ పంచాయతీ వద్ద జరిగిన గ్రామ సభలో జాబితాను అధికారులు ప్రకటించారు. దీంతో జాబితాలో అర్హులైన పేర్లు లేవని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

నాగిరెడ్డిపల్లిలో..

నర్వ: మండలంలో ప్రజాపాలన గ్రామ సభ మూడో రోజు సైతం ఆయా గ్రామాల్లో ప్రజలు అధికారులతో తమ నిరసనలు తెలియజేశారు. నాగిరెడ్డిపల్లి వద్ద ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అనర్హులను ఎంపిక చేశారని ప్రజలు అధికారులను నిలదీశారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీఓ రాఘవేందర్ పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభ..

దామరగిద్ద: మండల పరిధిలోని వత్తుగుండ్ల, తండా పలు గ్రామాల్లో అధికారులు నిర్వహించిన గ్రామ సభలు రసాభాసగా మారాయి. ఈ సందర్భంగా తమ పేర్లు అధికారులు చదివి వినిపించిన జాబితాలో లేక పోవడంపై ఆగ్రహించారు. దీంతో అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరారు. డిప్యూటీ సీఈఓ జ్యోతి, ఏఈఓ మణిచందర్ పాల్గొన్నారు.

హిందుపూర్‌లో..

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఎలాంటి సర్వే చేయకుండానే భూమి ఉన్న వారికే రైతు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా గుర్తించారని గ్రామస్తులు అధికారులను నిలదీశారు.



హిందుపూర్ గ్రామసభలో ..

మాగనూర్: మండలంలోని గ్రామ సభలో పథకాల ఎంపికపై అధికారులను స్థానికులు ప్రశ్నించారు. పలుమార్లు అప్లికేషన్ ఇచ్చినప్పటికీ తమకు ఇళ్లు మంజూరు కాలేదని గ్రామస్తులు వాపోయారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర పక్రియ అని ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగిన గ్రామసభ..

ధన్వాద: మండలంలోని మంత్రోనిపల్లి, యంనోనిపల్లి, హన్మన్‌పల్లి, మందిపల్లి తండలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపించారు. పేర్లు రానివారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలియజేశారు.



ఊట్కూరులో రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు



గొర్లోనిబాయి గ్రామ సభలో..



వత్తుగుండ్ల గ్రామ సభలో ..



మద్దూరులో..

వైభవంగా మహా చండీయాగం



నారాయణపేట రూరల్ : మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో గురువారం మహాచండీయాగం నిర్వహించారు. 12మంది అర్చకుల వేదమంత్రాల మధ్య పుణ్యాహవచనం, కళశస్థాపనం, రుద్రాభిషేకం, నవగ్రహ చండీయాగం చేపట్టారు. పలువురు దంపతులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి, పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

నారాయణపేట: దామరగిద్ద మండలం లోకూర్తి గ్రామానికి చెందిన సంతోషకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది గర్భిణిని పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. టెక్నీషియన్ వెంకటేష్ అత్యవసర వైద్య సూచనలు పాటిస్తూ అంబులెన్స్‌లోనే సాధారణ కాన్పు చేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డలు క్షేమమని తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల రిలేదీక్షలు

నారాయణపేట: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు.. జిల్లా టీవీఏసీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఈ కార్యాలయం ఎదుట కార్మికులను కన్వర్షన్ చేయాలని కొనసాగుతున్న దీక్షలు గురువారం నాటికి నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో రాఘవేంద్రగౌడ్, రమేష్, జైపాల్, సాదిక్, శ్రీధర్, సురేష్‌కుమార్, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.